‘రచన’ ప్రారంభ సంచిక నుంచి కూడా క్రమం తప్పకుండా చదివే పాఠకురాలిని నేను, కారణాంతరాల వల్ల చందా పొడిగించలేక పోయినా క్రమం తప్పకుండా కొని చదివే అలవాటు నాకు సాహిత్యనీలాకాశంలో ధ్రువ తార ‘రచన’. ‘రచన’ గురించి ఎంత చెప్పినా ఎన్నిసార్లు చెప్పిన ఒకటే మాట. ఉత్తమ సాహిత్య విలువలున్న పత్రికలలో మేటి ‘రచనే’ అంటే అతిశయోక్తి కాదు. వసంత లక్ష్మిలా అలంకరించుకున్న ‘రచన’ ఉగాది పచ్చడి లాంటి షడ్రుచులుగల రచనలను మాకందించింది. ‘రచన’ రాగానే గబగబ చదివేసి పక్కన పెట్టేయకుండా మధురమైన తీపి తాయిలాన్ని దాచుకుని తిన్నట్లు కొద్ది కొద్దిగా దాచుకుంటూ చదువుకుంటాను. ఒక్కమాటలో నాకు ప్రియమైన నేస్తం ‘రచనే’! ఎప్పటికైనా ‘పజిలింగ్ పజిల్’ ఆల్ కరెక్ట్‌గా పూరించాలనేది నా ఆశయం. ఏదైనా కథ చదివి సమీక్ష రాసే అలవాటున్న నాకు ‘సాహితీవైద్యం’ చదివిన తర్వాత కథ రాయాలన్న కోరిక. మరి నెరవేరుతుందో లేదో!

‘నేను మెచ్చిన కథ’ మీద అభిప్రాయం రాయమన్నారు. అలా వచ్చిన వాటిల్లో మీకు నచ్చిన అభిప్రాయం కూడా ప్రచురిస్తే బాగుంటుందేమో!

**- వేదుల పార్వతి** *(హైదరాబాద్)*

*(ఈ శీర్షిక ముఖ్యోద్దేశ్యం పాఠక మహాశయుల అభిప్రాయాలను గణనలోనికి తీసుకొని కొండొకచో పురస్కారాలను అందజేయడానికీ, ‘కథామహల్’ సంకలనం కోసం కథలను ఎంపిక చేయడానికీ, సాధారణ ప్రచురణకు వచ్చే కథల ప్రచురణార్హతను నిర్ణయించేందుకూ ఉద్దేశించింది. అనగా ఇది ముఖ్యంగా సంపాదకుని ఇంట్రాస్పెక్షన్‌కు ఉద్దేశించబడింది. ఈ శీర్షిక క్రింద అందిన అభిప్రాయాలను ప్రచురించడం బహుశః సాధ్యం కాకపోవచ్చు. అయితే కొందరి అభిప్రాయాలను తగురీతిన సత్కరించాలనే ఆలోచన ఉంది. చూడాలి! - సం॥)*

డా॥ నారాయణరావుగారు ఇకలేరని తాజా ‘రచన’లో చదివి చింతించాను. “కథామహల్”కు షాజహాన్ ఆయన! ఢిల్లీ వచ్చినపుడు ఇంటికి ఫోన్ చేసి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ‘రెంచిన్’ కథ నచ్చినట్లుగా చెప్పారు.




**- డా॥ టి. సంపత్‌కుమార్** *(న్యూఢిల్లీ)*

చెన్నై వెళుతూ ఫిబ్రవరి మాసం ‘రచన’ ఇంటింటి పత్రిక స్టేషన్ బుక్‌స్టాల్‌లో మొట్టమొదటిసారిగా చూశాను. సీరియల్సుకు తప్ప మంచి కథలకు ప్రాముఖ్యత దొరకని ఈ రోజుల్లో మీ ప్రయత్నం నాకు చాల సంతోషం కలిగించింది.

1974-84 దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం మాట-తెలుగులో పాతిక కథలు వ్రాయడం జరిగింది. చాలా కథలు ‘ఆంధ్రప్రభ’లో ప్రచురించారు. మరికొన్ని ‘విపుల’లో, కొన్ని ఇక్కడా అక్కడా ప్రచురితమైనాయి. నేను ఎప్పుడూ తెలుగు రచయితల జాబితాలో లేను. ఎప్పుడూ ఇంగ్లీషు లిటరేచర్ చదవడం, నా ఆలోచనలన్నీ ఇంగ్లీషులో జరగడం, ఇంట్లో ఇంగ్లీషులో మాట్లాడుకోవడం, ఇంగ్లీషులో కథలు రాయడం మూలంగా తెలుగు సాహిత్యం గురించి తెలుసుకునే ప్రయత్నం చేయలేదని ఒప్పుకుంటున్నాను.

గత ఇరవై సంవత్సరాలుగా ‘కమ్యూనిటీ హెల్త్ ట్రైనింగ్’లో పడిపోయి మరో ప్రపంచంలో వుండిపోయాను. ఇప్పుడు మళ్ళీ తెలుగు కథలు వ్రాయాలని ఆశ పుట్టింది. రెండు సంవత్సరాల క్రితం 2000లో ‘అంతస్స్వరం’ అని తెలుగులో నవల ప్రారంభించి ముగించాను కానీ అది తెలుగు పత్రికలు స్వీకరిస్తారనే ఆశ లేదు. ఫిబ్రవరి ‘రచన’లో ‘స్మృతి’ ఎన్. అనూరాధ రచన నన్ను కదిలించివేసింది. ఒక విధంగా నన్ను ఇన్‌స్పైర్ చేసింది.

**డా॥ ఉమ** *(బెంగుళూరు)*

ఉగాది+ జన్మదిన ప్రత్యేక సంచికగా వెలువడిన ‘రచన’ నిజంగా ఒక సాహితీ ఖజానా! ముఖచిత్రం నుండి చిట్టచివరి పేజీ వరకు అణువణువునా తెలుగుతనం ఉట్టిపడుతూ సంవత్సరాది సంబరాన్ని చాలా ముందుగానే మా ఇంట్లోకి తెచ్చింది. *‘వాడ్రేవు పతంజలి స్మారక కథల పోటీ ఫలితాలు’*, *‘సిలికానాంధ్ర కవితల పోటీ ఫలితాలు’* ఒకేసారి వెలువరించి పసందైన సాహితీ విందు భోజనం చేయించినట్లుగా అనిపించింది.

పజిలింగ్ పజిల్ - 108 కీ సొల్యూషన్‌లో ‘రచన’ కనిపించి థ్రిల్లయిపోయాం!

**- ప్రతాప వెంకట సుబ్బారాయుడు** *(సికింద్రాబాద్)*

ఏప్రిల్ 2002 సంచిక అందింది. అందులో శ్రీ వాడ్రేవు పతంజలి స్మారక కథల పోటీకి నేను పంపిన కథ “ఏండేంజర్డ్ స్పీసీస్” ప్రచురణకు స్వీకరించారని తెలిసి చాలా సంతోషించాను. ‘మచ్చిక’ కథ రచయిత శ్రీ కవనశర్మ గారు. ఆయన కనుక అంత చక్కగా వ్రాసేరనిపించింది. ‘కథాపీఠం’ శీర్షికలో శ్రీమతి జలంధరగారి కథ ‘మహోత్సవం’ నిజంగా అమృతవర్షిణి. ఒక్కొక్కసారి బాధ్యతలు మనిషి జీవితాన్నే కబళించే విధంగా ఉంటాయి. తెలివిగా జీవితాన్ని ప్లాన్ చేసుకుని జీవించేవారెప్పుడూ విజేతలే! వారు బాధ్యతలను తప్పించుకోరు. అలా అందరూ తమ తమ జీవితాలను మలచుకొనే అవకాశం, ఆశయం ఉంటే మనిషికి మనుగడ శాంతిమయం అవదూ!

**- అరుణ నిష్ఠల** *(కోల్‌కట)*

తెలుగుతనం మూర్తీభవించేవిధంగా మిగతా మాసపత్రికలకు భిన్నంగా అందమైన ముఖచిత్రాలతో నెలనెలా వెలువడే ‘రచన’ పాఠక హృదయంలో ఉన్నత స్థానాన్ని అధిరోహిస్తున్నది. కథలకు ఎంతో ప్రోత్సాహాన్ని దిస్తూ, రకరకాల పోటీలను నిర్వహిస్తూ, పాఠకుల సృజనాత్మకతను వెలికితీస్తున్న మీ ప్రయత్నం అభినందించదగ్గది. పత్రికాభివృద్ధికి మీరు చేస్తున్న నిరంతర కృషి ప్రశంసార్హం!

ప్రతినెలా ముఖ్యంగా పండుగ సమయాల్లో ఇంటిల్లిపాదికీ బహిరంగంగా చదవగలిగే పత్రికగా రూపొందించడం నిజంగా విశేషం.

కన్నెరుగు కామాన్ని - క్షణికోద్రేకాలను రెచ్చగొట్టే కొన్ని పత్రికలు - మధ్యలో మోక్షాన్నందించినా, భక్తి ప్రచారం చేసినా అవి - మన సంస్కృతీ సంప్రదాయాలను ఇతరులు ఎద్దేవా చేసేందుకు వీలుంది. అలాకాక సభ్యత, సంస్కారాలకు విలువనిస్తూ సాగిపోతున్న ‘రచన’ - ఇంకా ఎత్తుకు ఎదగాలని కాంక్షిస్తూ...

**-రావెల పురుషోత్తమరావు** *(హైదరాబాద్)*

## నా అభిప్రాయం



ఏప్రిల్ నెల 'రచన' ఉగాది+జన్మదిన ప్రత్యేక సంచికగా, తెలుగుతనం ఉట్టి పడుతూ వాలింది. క్రమం తప్పకుండా ఇలా నెలనెలా 'రచన' వచ్చేయడం పాఠకులకెంతో సంతృప్తికరంగా ఉన్నట్టు ఉత్తరాల ద్వారా తెలుస్తూనే ఉంది. ఈ శుభ సమయంలో తోటి పాఠకమిత్రులకీ, రచనాభిమానులకీ, నాదొక చిన్న మనవి. ప్రతీ పాఠకుడూ,అభిమానీ, రచనాభివృద్ధిని కోరుకునే వారే కాబట్టి, వారు కొని చదవడమే కాకుండా వారి సన్నిహితుల్ని, బంధు మిత్రుల్ని, 'రచన' కొని చదివే అలవాటు చేసుకునేలా ప్రోత్సహించగలిగితే మంచిది. ప్రతీపాఠకుడూ, పాఠకురాలూ దీనిని ఒక యజ్ఞంలా చేపట్టి 'రచన'కు నెలనెలా క్రొత్త పాఠకుల్ని, సంవత్సర చందాదారుల్ని పరిచయం చేయగలిగితే సర్క్యులేషన్ పెరగడం ఖాయం. ఏ పత్రికకైనా సర్క్యులేషన్, మనిషి శరీరంలో బ్లడ్ సర్క్యులేషన్‌తో సమానం అన్నది నిర్వివాదాంశం కదా! పాఠకులప్పగించిన ఎన్నో బాధ్యతల్ని, నిర్వాహకులు తు.చ. తప్పకుండా ఆచరిస్తున్నారు. మరి పాఠకులు కూడా తమ వంతు బాధ్యతగా పై సూచనని ఆచరించగలిగితే ఉభయకారకంగా ఉంటుంది.

*"కథామహల్ - దువ్వూరి శారదాంబ స్మారక కథల పోటీ"* ద్వారా తెలుగు కథకు అసామాన్యమైన చేయూతనిచ్చిన డా॥ డి.ఎ.ఎ.ఎస్.నారాయణరావు గారు ఎనభై నాలుగేళ్ళ నిండుజీవితం నుంచి నిష్క్రమించారు. కానీ, ఎందరో అభిమానుల హృదయకుహరాల్లో వారు సజీవులుగానే ఉంటారు. ఈ విషయం డా॥ వంగూరి చిట్టెంరాజుగారు వారి కర్పించిన 'నివాళి'లో తేటతెల్లమౌతూనే ఉంది. వెనుకబడిన విశాఖ జిల్లాలో, కశింకోటలాంటి పల్లెటూళ్ళో పలకా బలపం పట్టి బళ్ళోకెళ్ళిన బాలుడు, వివేకం మా సొమ్మే అని విర్రవీగే విదేశాల వారికి సైతం విద్యాబుద్ధులు గరిపే ఎత్తుకి ఎదగడం ఏమంత సామాన్యమైన విషయం కాదు!

ఏప్రిల్ నెల 'రచన' జన్మదిన సంచిక, డా॥ నారాయణరావుగారి దివ్యస్మృతికి అంకితమివ్వడం ఎంతైనా సమంజసంగా ఉంది. ఆ 'అమెరికా తెలుగు భీష్ముడి'కివే మా స్మృత్యంజలులు.

**- పాలెపు బుచ్చిరాజు** *(బరోడా)*

## పాత 'రచన'లు పొందే విధానం

**చాలా** కాలంగా కొత్తగా చేరుతున్న చందాదారులైతేనేమి, పాత పాఠకులైతేనేమి, పాత సంచికల కొరకు తరచుగా రాస్తున్నారు. ఇలా పాత సంచికలు అవసరమైన రచనాభిమానుల సౌకర్యార్థం మా దగ్గిర స్టాకు ఉన్నంతవరకూ చక్కగా బైండ్స్‌గా తయారు చేయించడం జరిగింది. ఆ వివరాలు :

| బైండ్ నెం | | సంచికలు | వెల | | బరువు | పోస్టేజి | రిజిస్ట్రేషన్ |
|---|---|---|---|---|---|---|---|
| 3. | ఫిబవరి '93 నుండి సెప్టెంబర్ '93 | 7 | రు. 70/- | US $ 31 | 1250గ్రా | రు.25/- | రు. 17/- |
| 4. | డిసెంబర్ '93 నుండి జూన్ '94 | 7 | రు. 70/- | US $ 31 | 1250గ్రా | రు.25/- | రు. 17/- |
| 12. | జన్మదిన ప్రతిష్ఠాత్మక సంచిక '99 | 5 | రు. 90/- | US $ 30 | 750గ్రా | రు.15/- | రు. 17/- |
| 14. | జన్మదిన ప్రతిష్ఠాత్మక సంచిక 2000 | 7 | రు. 116/- | US $ 36 | 960గ్రా | రు.19/- | రు. 17/- |
| 15. | మార్చి '00 నుండి డిసెంబర్ '00 | 8 | రు. 150/- | US $ 48 | 1250గ్రా | రు.25/- | రు. 17/- |
| 16. | ఏప్రిల్ '01 నుండి డిసెంబర్ '01 *(2001 జన్మదిన ప్రత్యేక సంచికతో సహా)* | 11 | రు. 190/- | US $ 60 | 1250గ్రా | రు.25/- | రు. 17/- |

పాత సంచికల బైండ్స్ ధరని అందులో ఉన్న సంచికలను బట్టి నిర్ణయించడం జరిగింది. ఇటీవల కాలంలో పోస్టలు రేట్లు అనూహ్యంగా పెరిగిన కారణంగా, బైండ్స్ ధరకు పోస్టలు చార్జీలు కలిపి పంపాల్సి ఉంటుంది. మూడు బైండ్స్‌కి తక్కువ కాకుండా తెప్పించుకునే వారికి రిజిస్ట్రేన్ ఖర్చులు 'రచన' భరిస్తుంది.

పాత సంచికలు కావలిసిన వారు ఆ బైండ్స్ ఖరీదును మనిఆర్డరు/డిమాండ్ డ్రాఫ్ట్ (Drawn in favour of '**RACHANA**' payable at 'HYDERABAD') ద్వారా పంపితే తిరుగు టపాలో రిజిష్టర్ పోస్టు ద్వారా పంపగలము. ఈ అవకాశం కొద్దిగా ఉన్న స్టాకు అయిపోయేటంతవరకు మాత్రమేనని గమనించగలరు.

**- సంపాదకుడు**